సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



డ్రాగన్.. సిరులు కురిపించెన్

మెట్ట ప్రాంతంలో సేంద్రియ పద్ధతిలో డ్రాగన్ తోట సాగు చేసి సిరులు పండిస్తున్నారు భీమిలికి చెందిన సూర్యప్రకాష్, చంద్రశేఖర్. 8లో



విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 8లో

నేడు శాంతి హోమం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం శాంతి హోమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు ఆలయ కల్యాణమండపంలో హోమాన్ని జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

అనధికార బాణసంచాపై ఉక్కుపాదం

- అనుమతి లేకుండా తయారు చేసి విక్రయిస్తే కఠిన చర్యలు
- ఎస్పీల వీడియో కాన్ఫరెన్స్‌లో రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



సాక్షి, విశాఖపట్నం: దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో అనుమతి లేకుండా బాణసంచా తయారీకి పాల్పడితే కఠిన చర్యలుంటాయని రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి హెచ్చరించారు. సోమవారం డీఐజీ కార్యాలయం నుంచి అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాలు జరిపే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనుమతులు ఉన్న గొడౌన్లు, షాపుల వద్ద భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో చూడాలని, లేకుంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర శాఖల అధికారుల సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో అనధికారికంగా బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలు చేపట్టే వారిని ముందుగా గుర్తించి, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు వద్ద బైండోవరు చేయాలని అధికారులను డీఐజీ ఆదేశించారు.

30న జాబ్ మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేశారు. జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో నాలుగు కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. పూర్తి వివరాలకు 6304634447 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోఆర్డినేటర్ టి. ఆనంద్‌బాబు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడికి సీపీఎం ఖండన

పాడేరు: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంపై బీజేపీ శ్రేణులు దాడి చేయడం సరైన పద్ధతి కాదని, ఈ దాడిని తాము ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీటీడీ లడ్డూ వ్యవహారాన్ని ఆసరగా చేసుకుని బీజేపీ అనుబంధ బీజేవైఎం కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలని పేర్కొన్నారు. సంఘపరివార్ శక్తులు ఒక పథకం ప్రకారమే లడ్డూ సమస్యను ఆసరగా చేసుకుని మత ఉద్రిక్తతను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం తగదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పుతున్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కేజీహెచ్ నుంచి చట్రాపల్లి గిరిజనులు డిశ్చార్జ్



డిశ్చార్జ్ అయిన రామారావు, కృష్ణ

గూడెంకొత్తవీధి: మండలంలోని చట్రాపల్లిలో ఈనెల 8న కొండచరియలు విరిగిపడిన ఘటనలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఐదుగురిలో ఇద్దరిని సోమవారం డిశ్చార్జ్ చేశారు. కొండ చరియలు విరిగిపడిన దుర్ఘటనలో కుమారి అనే మహిళ మృతిచెందగా రామారావు, కృష్ణ, సుమిత్ర, పండన్న, రాజు అనే ఐదుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. క్షతగాత్రులకు చింతపల్లి సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి వారు అక్కడ చికిత్స పొందుతున్నారు. వారిలో రామారావు, కృష్ణలను సోమవారం డిశ్చార్జ్ చేశారు. మిగిలిన ముగ్గురిని రెండు మూడు రోజుల్లో డిశ్చార్జ్ చేయనున్నారు.

అయ్యో... అల్లం రైతు



హుకుంపేట మండలం అమూరు సమీపంలో అల్లం సాగు



అల్లం ధర భారీగా తగ్గిపోవడంతో జిల్లాలో ఆ పంటను సాగుచేస్తున్న రైతులు గగ్గోలు పెడుతున్నారు. తాము భారీగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు వారాల కిందట రూ.140 ధరతో కొనుగోలు చేసిన వ్యాపారులు ఒక్కసారిగా సగానికి తగ్గించి రూ.70 ధరతో కొనుగోలు చేస్తున్నారు.కేరళ, **తమిళనాడు రాష్ట్రాల్లో** అల్లం ధర తక్కువగా **ఉందన్న సాకుతో** వ్యాపారులంతా సిం**డికేట్‌గా మారి** ఇక్కడ కూడా ధర **తగ్గించి కొనుగోలు** చేస్తున్నారని రైతులు **ఆవేదన వ్యక్తం** చేస్తున్నారు.

- భారీగా తగ్గిన రేటు
- కిలో రూ.70 ధరతో వ్యాపారుల కొనుగోలు
- రెండు వారాల కిందట కిలో రూ.130
- లబోదిబో మంటున్న రైతులు



హుకుంపేట సంతలో అల్లం కొంటున్న చిరువ్యాపారులు

సాక్షి,పాడేరు: గిరిజనులు సేంద్రియ పద్ధతిలో సాగుచేసే అల్లానికి నాణ్యతలో నంబర్-1గా పేరుంది. ఎక్కువ రోజులు నిల్వ ఉండే మన్యం అల్లాన్ని తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇంత ప్రాధాన్యత గల మన్యం అల్లానికి ప్రస్తుత మార్కెట్‌లో గిట్టుబాటు ధర కరువైంది. రెండు వారాల క్రితం కిలో రూ.130 నుంచి రూ.140 ధరతో కొనుగోలు చేసిన వ్యాపారులు ఈ వారం ధరను సగానికి తగ్గించారు. కిలో రూ.70కు మించి కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కేరళ,తమిళనాడు అల్లంతో ...

కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో దిగుబడులు ఎక్కువగా రావడంతో పాటు, అక్కడి అల్లం తక్కువ ధరకు లభిస్తోంది. దీంతో వ్యాపారులు ఆ అల్లాన్ని ఇక్కడకు దిగుమతి చేస్తున్నారు. నాణ్యత తక్కువగా ఉన్నప్పటికీ కిలో ధర రూ.50లోపే ఉండడంతో ఆ ప్రభావం మన్యం అల్లంపై పడింది. అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ జిల్లాలకు చెందిన వ్యాపారులంతా తక్కువ ధర చెల్లిస్తుండడంతో మన్యం అల్లాన్ని స్థానిక చిరు వ్యాపారులు కిలో రూ.70 లోపే వారపుసంతలు, మండల కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నారు.

ధర తగ్గడంతో భారీ నష్టం



అల్లం ధరలను వ్యాపారులు కావాలనే తగ్గిస్తున్నారు.రెండు వారాల క్రితం కిలో రూ.130తో సంతల్లో వ్యాపారులు కొనుగోలు చేయగా ఈవారం కిలో రూ.70తో కొనడం అన్యాయం.రెండు ఎకరాల్లో అల్లం పంట సాగు చేస్తున్నాను. దిగుబడి దశలో అల్లం ధర తగ్గడంతో భారీగా నష్టపోతున్నాను.

– పాంగి ప్రసాద్, అల్లం రైతు, ఆమూరు, హుకుంపేట మండలం.

గిట్టుబాటు ధర కల్పించాలి



మన్యంలో సాగు చేస్తున్న అల్లం నాణ్యతలో నంబర్-1 గా పేరొందినప్పటికీ ఈసీజన్‌లో గిట్టుబాటు ధర లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ధరను తగ్గించేస్తున్నారు.పాడేరు ఐటీడీఏ అల్లాన్ని గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– కొర్ర జగబందు, అల్లం రైతు, మాలిగూడ, జీకే వీధి మండలం

1400 ఎకరాల్లో సాగు



పాడేరు డివిజన్‌లోని హుకుంపేట, జీకే వీధి,డుంబ్రిగుడ,చింతపల్లి, పాడేరు, అరకులోయ తదితర ప్రాంతాల్లో గిరిజన రైతులు 1,400 ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో అల్లం సాగుచేస్తున్నట్టు ఉద్యానవన అధికారులు తెలిపారు.ఎకరానికి 4నుంచి 5టన్నుల వరకు దిగుబడి వస్తుంది.ప్రస్తుతం దిగుబడులు ప్రారంభం కావడంతో పంటను తవ్వి రైతులు అమ్మకాలను చేపడుతున్నారు.ధర లేకపోవడంతో రైతులంతా ఉసూరుమంటున్నారు.రెండు వారాల వ్యవధిలోనే కిలోకు రూ.70ధర తగ్గడం దారుణమని రైతులు వాపోతున్నారు.

ఏజెన్సీలో పనిచేస్తున్న వారికి మళ్లీ అన్యాయం

- తహసీల్దార్ల బదిలీలో నిబంధనలకు తూట్లు
- సిఫారసులకే పెద్దపీట
- ఎమ్మెల్యేలు సూచించిన వారికే కేటాయింపు

మహారాణిపేట(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో **తహసీల్దార్ల బదిలీల్లో సిఫార**సులకే పెద్దపీట వేశారు. **స్థానిక ఎమ్మెల్యేల ఆదేశాను**సారం పోస్టింగ్‌లు లభించాయి. **చాలా కాలంగా విశాఖ** నగరంలోనే తిష్టవేసిన **తహసీల్దార్లను కదిపే** సాహసం ఉన్నతాధికారులు **చేయలేకపోయారు.** దీంతో అల్లూరి సీతా**రామరాజు జిల్లాలో పనిచేసే** వారికి నిరాశే ఎదురైంది. **రెండేళ్లగా మన్యంలో ప**నిచేసిన వారిని, 50 ఏళ్లు **దాటిన వారిని ఏజెన్సీ నుం**చి ఇతర ప్రాంతాలకు **బదిలీ చేయాలన్న జీవోకు** అధికారులు తూట్లు పొడిచారు. **మైదాన ప్రాంతాల్లో** పలు కీలకమైన తహసీల్దార్ **పోస్టులను కూడా** కూటమి నేతలు చెప్పిన **వారికే దక్కాయి. బదిలీల్లో** చివరి రోజు విశాఖ జిల్లా **కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర** ప్రసాద్ మొత్తం 16 మంది **తహసీల్దార్లకు పోస్టిం**గులు, కేటా యింపులు **చేశారు. ఇందులో ఎనిమి**ంది మందిని విశాఖ **జిల్లాకు, ఐదుగుర్ని అనకా**పల్లి జిల్లాకు, ముగ్గుర్ని **అల్లూరి సీతారామరాజు జి**ల్లాకు కేటాయిస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసిన విష యం తెలిసిందే. తహసీల్దార్లు, ఉప తహసీల్దార్ల పోస్టులన్నీ స్థానిక ఎమ్మెల్యేల సిఫారసుల మేరకు నిర్వహించారు. కొందరు అధికారులు స్వయంగా ఎమ్మెల్యేలతో ఉన్నతాధికారులకు ఫోన్లు కూడా చేయించారు. దీంతో కూటమి ఎమ్మెల్యేల పంపిన జాబితా ప్రకారం తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లకు బదిలీలు నిర్వహించారనివిస్తృతంగా ప్రచారం సాగుతోంది.

వీరంటే ఉన్నతాధికారులకూ హడలే..!

గతంలో ఇచ్చిన పోస్టింగ్ జోలికి ఉన్నతాధికారులు వెళ్లలేదు. ఇప్పుడు అన్నీ కొత్త పోస్టింగ్‌లే ఇచ్చారు. గతంలో కేటాయించిన పోస్టింగ్‌లో కొనసాగుతున్న పలువురి తహసీల్దార్లపై తీవ్ర ఆరోపణలు ఉన్నా.. వారిని బదిలీ చేసేటంత సాహసం ఉన్నతాధికారులు చేయలేకపోయారు. వీరిని కొనసాగించేందుకు ఎమ్మెల్యే ఒత్తిడే ప్రధాన కారణంగా తెలుస్తోంది. మొత్తం మీద నాలుగు మండలాల్లో పోస్టింగ్‌లపై విమర్శలు వస్తున్నాయి. కొంత మంది ఉప తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌వో పోస్టుల్లోనే నిబంధనలు పట్టించుకోకుండా స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే కేటాయించారు.

మళ్లీ వారికి నిరాశే..: అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి విశాఖలో పనిచేయడానికి పలువురు తహసీల్దార్లు ఉత్సాహం చూపారు. అలాగే అనకాపల్లి జిల్లా నుంచి కూడా చాలా మంది దరఖాస్తు చేశారు. మొత్తం మీద ఈ రెండు జిల్లాల నుంచి 15 మంది విశాఖలో పనిచేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. నలుగురు తహసీల్దార్లు ఎంతో కాలం నుంచి ఏఎస్ఆర్ జిల్లాలో పనిచేస్తున్నారు. వీరిలో ఇద్దరు ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నారు. వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్నారు. నిబంధనల ప్రకారం ఈసారి కచ్చితంగా మైదాన ప్రాంతంలో పనిచేసే అవకాశం వస్తుందని ఎంతగానో ఎదురుచూశారు. ప్రభుత్వ జీవోను కాదని నేతల సిఫారసు లేఖలకే ఉన్నతాధికారులు పెద్దపీట వేశారు.

లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం తగదు

- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ నీచ రాజకీయం
- అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



ముంచంగిపుట్టు: రాజకీయ లబ్ధి కోసమే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. విదేశాల్లో ఉన్న ఆయన ఫోన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు, టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. వంద రోజుల పాలనలో కూటమి సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని ఇప్పటి వరకూ అమలు చేయలేదని, సూపర్ సిక్స్ అమలుపై దృష్టి సారించకుండా ప్రజలను ఏమార్చేందుకు ఇంతటి నీచానికి చంద్రబాబు అండ్ కో దిగజారారని మండిపడ్డారు. ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదన్నారు. నిర్దేశించిన ప్రమాణాలు లేకుంటే నెయ్యి ట్యాంకర్‌ను గోదాములోకి కూడా అనుమతించరనే విషయాన్ని టీడీపీ నేతలు మరిచిపోయి మాట్లాడుతున్నారని అన్నారు. హామీలు అమలు చేయకుండా తమది మంచి ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ జనం మాత్రం ఇది ముంచే ప్రభుత్వం అని అంటున్నారని చెప్పారు. చంద్రబాబుకు దమ్ముంటే తిరుమల లడ్డూ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపిస్తే నిజానిజాలు బయటకు వస్తాయని తెలిపారు. అంతేగాని నోటికి వచ్చినట్టు మాట్లాడి దిగజారుడు రాజకీయాలు చేయవద్దన్నారు.

జిల్లా పరిషత్‌లో భారీగా బదిలీలు

మహారాణిపేట(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్‌లో మొత్తం 154 మందికి బదిలీలు చేశారు. వీరిలో 24 మంది ఎంపీడీవోలున్నారు. కార్యాలయ పరిపాలనా అధికారులు (ఏవోలు), సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, నాల్గో తరగతి ఉద్యోగులు ఉన్నారు. కొత్తగా వచ్చిన పది మందికి ఏజెన్సీలో పోస్టింగులు ఇచ్చారు.

మండలం	ఎంపీడీవోలు		
		గొలుగొండ	ఎం.మేరీరోజ్
హుకుంపేట	టి.రమాదేవి	కె.కోటపాడు	ఎ.ఎ.సాంబశివరావు
కొయ్యూరు	బి.రమేష్ నాయుడు	మునగపాక	టి.వి.ఎస్.వి. ప్రసాదకుమార్
ముంచంగిపుట్టు	ఎం.శ్రీసాయి హర్ష	నక్కపల్లి	డి.సీతారామరాజు
పాడేరు	పి.ఆశాజ్యోతి	నర్సీపట్నం	కె.ఉషశ్రీ
పెదబయలు	కె.వి.ప్రసాద్	నాతవరం	పి.పార్థసారథి
ఆనందపురం	వి.జానకి	పరవాడ	ఎస్.డి.శ్యాం సుందర్
భీమిలి	ఎస్.హనుమంతరావు	రోలుగుంట	వి.ఎస్. నాగేశ్వరరావు
అచ్యుతాపురం	కె.ప్రభాకరరావు	రాంబిల్లి	ఎస్.జయమాధవి
బుచ్చెయ్యపేట	వి.విజయలక్ష్మి	సబ్బవరం	పి.పద్మజ
చీడికాడ	వి.హేమసుందరరావు	ఎస్.రాయవరం	ఎస్.డేవిడ్‌రాజు
చోడవరం	పి.వి.ఎస్.జె. ఆంజనేయులు	వి.మాడుగుల	జె.తేజరత్నం

రెవెన్యూ కేడర్లలో...

రెవెన్యూశాఖలో పలు కేడర్లలో బదిలీలు నిర్వహించారు. మొత్తం 40 మంది డిప్యూటీ తహసీల్దార్ల (డీటీ)ను బదిలీ చేశారు. ఆరుగురు డీటీలను అల్లూరి సీతారామరాజు జిల్లాకు, ఆరుగుర్ని అనకాపల్లి జిల్లాకు కేటాయిస్తూ ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే విశాఖ జిల్లాలో 28 మంది డీటీలను బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు 14 మంది జూనియర్ అసిస్టెంటు/టైపిస్టులను, 55 మంది సీనియర్ అసిస్టెంట్లను, 28 మంది వీఆర్‌వోలు గ్రేడ్-2లకు కూడా బదిలీ చేశారు.

సత్వరమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం

- బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించి,బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా విజిలెన్స్, మానటరింగ్ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.జిల్లాలోని అన్ని పోలీసు సబ్‌డివిజన్ల పరిధిలో నమోదైన కేసుల పరిష్కారంపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధితులకు పరిహారం అందించడంలోను జాప్యం లేకుండా చూడాలన్నారు. 2022 నుంచి 2024 వరకు పాడేరు డివిజన్‌లో 12, చింతపల్లిలో 12, రంపచోడవరంలో 19, చింతూరులో 9 కేసులు నమోదైనట్టు చెప్పారు. ఇప్పటివరకు 11 కేసుల్లో బాధితులకు రూ.11.35 లక్షలు,చార్జిషీటు వేసిన నాలుగుకేసులకు సంబంధించి రూ.2.50 లక్షల ఆర్థిక సాయం అందించినట్టు తెలిపారు. విశాఖపట్నం,కాకినాడ కలెక్టరేట్‌లలో గల జిల్లాకు సంబంధించిన కేసులను ఇక్కడికి బదిలీ చేయాలని ఆదేశించారు. భూతగాదాలను త్వరితగతిన పరిష్కరించి అసలైన హక్కుదారులను గుర్తించాలనిసూచించారు. లైంగికదాడులు, హత్య కేసుల్లో బాధిత కుటుంబాలకు భూమిని మంజూరు చేయాలని,ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోతే కొనుగోలు చేసైన అందజేయాలని ఆదేశించారు.

పక్కాగా మెనూ అమలు

జిల్లా వ్యాప్తంగా అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఇతర గిరిజన విద్యాలయాల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.విజిలెన్స్ కమిటీ అధికారులు గిరిజన విద్యాలయాల్లో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలుకావడం లేదని, ఉపాధ్యాయులకు మాత్రం ప్రత్యేకంగా చికెన్, మటన్‌లతో వంటలు చేసి పెడుతున్నారని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యాలయాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, విద్యార్థులు సెలవులకు వెళ్లి,తిరిగి పాఠశాలలకు వచ్చే సమయంలో వారికి వైద్యపరీక్షలు నిర్వహించాలని, ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీవోలను ఆదేశించారు. విజిలెన్స్ కమిటీ సమావేశానికి ఐసీడీఎస్,గిరిజన సంక్షేమ(విద్యా)శాఖ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.ఈ సమావేశంలో ఎస్పీ అమిత్‌బర్దర్,జేసీ అభిషేక్‌గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, వర్చువల్ విధానంలో రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్,డీఆర్‌వో పద్మావతి,సాంఘిక సంక్షేమశాఖ డీడీ జనార్దనరావు, గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ ఎల్.రజని, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానంలో పలువురు ఉద్యోగులకు బదిలీలు



సింహాచలం : దేవదాయశాఖ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ హోదా కలిగిన ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేసింది. సింహాచలం దేవస్థానంలో డీఈఈగా పనిచేస్తున్న జి.వి.వి.నాగేశ్వరరావును అన్నవరం దేవస్థానానికి, ఏఈగా పనిచేస్తున్న కె.సూర్యారావు కనకమహాలక్ష్మీ దేవస్థానానికి, సూపరింటెండెంట్లుగా పనిచేస్తున్న సిరిపురపు కనకరాజును అరసవిల్లికి, జి.అప్పలనాయుడు విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌కి, వై.అప్పారావు, పి.వి.రమణను అన్నవరం దేవస్థానానికి బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వరాహాలరావు విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌కి, ఎ.శోభనాద్రాచార్యులును అరసవిల్లి దేవస్థానానికి, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.కృష్ణను విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌కి, జి.ఎస్.ప్రసాద్, వి.సన్యాసిరావు కనకమహాలక్ష్మీ దేవస్థానానికి బదిలీ చేశారు. కనకమహాలక్ష్మీ దేవస్థానంలో ఏఈగా పనిచేస్తున్న కె.సూర్యనారాయణమూర్తి, ఏఈవోగా పనిచేస్తున్న వి.రాంబాబు, సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న జి.వి.వి.ఎస్.కె.ప్రసాద్ సింహాచలం దేవస్థానానికి, అన్నవరం దేవస్థానంలో ఏఈవోగా పనిచేస్తున్న వి.వి.కృష్ణారావు, విజయనగరం మాన్సాస్ ట్రస్ట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కె.వి.రమణరావును సింహాచలం దేవస్థానానికి బదిలీ చేశారు. కనకమహాలక్ష్మి దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఆర్.గణేష్‌కుమార్, ఎం.వాసు, ఎం.రామజోగారావు, జి.నాగసత్యవాణి సింహాచలం దేవస్థానానికి, అరసవిల్లి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న శ్యామలరావు, కనకమహాలక్ష్మి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.నయినారును సింహాచలం దేవస్థానానికి బదిలీ చేశారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థిని మృతి



లక్ష్మీప్రియ(ఫైల్)

సాక్షి, పాడేరు: స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్న గిరిజన విద్యార్థిని పూజారి లక్ష్మీప్రియ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ఆమె గిరిజన సంక్షేమ వసతి గృహంలో ఉంటూ కళాశాలలో చదువుతోంది. లక్ష్మీప్రియ జ్వరం,ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో గత నెల 22న వసతి గృహం వార్డెన్, సిబ్బంది పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు కల్పించారు. ఆగస్టు 31న జిల్లా ఆస్పత్రి నుంచి లక్ష్మీప్రియ డిశ్చార్జ్ అయింది. తల్లిదండ్రులు ఆమెను స్వగ్రామమైన పెదబయలు మండలం తురకలవలస తీసుకువెళ్లారు. మళ్లీ ఆమె అస్వస్థతకు గురికావడంతో ఆదివారం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. కేజీహెచ్‌లో వైద్యసేవలు పొందుతూ లక్ష్మీప్రియ మృతిచెందింది.తమ కుమార్తె పరిస్థితి విషమంగా ఉందని వార్డెన్‌కు ఫోన్ చేసి తెలిపినా పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపించారు.తమ బిడ్డ మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయిదేవి



బాలసదనంలో మొక్క నాటుతున్న ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయిదేవి

సాక్షి, పాడేరు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, సంక్షేమం తమ లక్ష్యమని ఐసీడీఎస్ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అన్నారు. సోమవారం పాడేరులో ఆమె పర్యటించారు. ముందుగా తలారిసింగిలోని బాలసదనాన్ని సందర్శించారు. బాలికల యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హీ సేవ, వనమహోత్సవం కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం చింతలవీధి పంచాయతీ నడిమివీధి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ మాసోత్సవాలను ఆమె ప్రారంభించారు.గర్భిణులకు సీమంతాలతో పాటు చిన్నారులకు అన్నప్రాశన చేశారు. పౌష్టికాహారం నమూనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతో పాటు నివాసాల్లోను బలమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో పండించే చిరుధాన్యాలతో పాటు అధిక పోషక విలువలు ఉన్న పప్పుజాతులు, ఆకు కూరలు, కూరగాయలు, దుంపజాతులను రోజువారీ ఆహారంలో వినియోగించాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని,రక్తహీనత సమస్యకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలవీధి సర్పంచ్ వంతాల సీతమ్మ, పీడీ సూర్యలక్ష్మి, సీడీపీవో ఝాన్సీరాణి,సూపర్‌వైజర్లు రెడ్డి ఊర్మిళ, చెల్లయమ్మ, రాజేశ్వరి,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు - 8లో

విద్యుత్ తీగలతో జంతువుల వేటకు అడ్డుకట్ట వేయాలి


వెదుళ్ల లచ్చిరెడ్డి

వై.రామవరం: అడవి జంతువుల వేట కోసం ఏర్పాటుచేస్తున్న విద్యుత్ తీగల వల్ల మనుషుల ప్రాణాలు బలవుతున్నాయని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అడవి జంతువులకు అమర్చిన విద్యుత్ తీగలను తాకి మనుషులు మృత్యువాతకు గురవుతున్నా, ఆయా వేటగాళ్లపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5న మండలంలోని దేవరమడుగులు గ్రామంలో లోత సూరిరెడ్డి(33) అనే వ్యక్తి అడవి జంతువులకు అమర్చిన విద్యుత్ తీగలలో పడి మృతి చెందిన విషయం తెలిసిందన్నారు. అయితే దీనికి కారకులైన వారిపై నేటి వరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. మండలంలోని బుల్లోజిపాలెం గ్రామంలో ఒక వ్యక్తి, సింహాద్రిపాలెం గ్రామానికి చెందిన వేట్ల శ్రీరాములు, చవిటిదిబ్బలు గ్రామానికి చెందిన కుర్రే వెంకటేశ్వర్లు ఐదు రోజుల క్రితం ఆయా ప్రాంతాల్లో అడవి జంతువుల వేటకు అమర్చిన విద్యుత్ తీగలలో పడి చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ తీగలతో అడవి జంతువుల వేటకు అడ్డుకట్ట వేయాలని, ఆయా వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై స్థానిక ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా ఆ ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత ఉన్నతాధికారుల సూచనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి


హుకుంపేటలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసిన గిరిజన సంఘం నాయకులు


అరకులోయలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హుకుంపేట: మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన సంఘం అధ్యక్షుడు పాంగి సోమన్న ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ ఏజెన్సీలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు గిరిజనులంతా ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/70 చట్టం పటిష్టంగా అమలు జరిగేలా చూడాలన్నారు. గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలంటే బినామీ దారులపై చర్యలు తీసుకోవాలన్నారు. నేతలు కృష్ణారావు, హైమావతి, లక్ష్మణరావు, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మన్యంలో 1/70 చట్టం పటిష్టంగా అమలు జరిగేలా చూడాలని జేఏసీ మండల కన్వీనర్ గోపాల్ చెప్పారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 25న చేపట్టనున్న ర్యాలీలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న కాపుగంటి కృష్ణారావు నిర్మాణలను పూర్తిగా తొలగించాలని, టిడిపి సర్పంచ్ నిర్మాణం చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్‌ని ఐటిడిఏ స్వాధీనం చేసుకుని నిరుద్యోగులకు కేటాయించాలన్నారు. మహదేవ్, రాజ్‌కుమార్, నారాయణ,ఆనంద్, కిల్లో బుద్ధు,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రాగన్.. సిరులు కురిపించెన్



నమ్మివానిపేటలో ఐదెకరాల్లో సేంద్రియ పద్ధతిలో సాగు ● లాభాలు ఆర్జిస్తున్న నెల్లిమర్ల సోదరులు



తగరపువలస: మెట్ట ప్రాంతంలో సేంద్రియ పద్ధతిలో డ్రాగన్ తోట సాగు చేసి సిరులు పండిస్తున్నారు భీమిలికి చెందిన నెల్లిమర్ల సూర్యప్రకాష్, చంద్రశేఖర్. గతంలో వీరి తల్లిదండ్రులు జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు నమ్మివానిపేట ప్రాంతంలో ఎకరనేలలు కొనుగోలు చేశారు. కోవిడ్ సమయంలో సూర్యప్రకాష్ ఇంటి వద్దే ఉండడంతో తమ భూముల్లో ఎలాంటి పంట సాగు చేస్తే బాగుంటుందో శోధించాడు. డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తే లాభాలు గడించవచ్చని భావించాడు.

మన వాతావరణానికి అనుకూలం

ప్రస్తుతం మనదేశ అవసరాలకు 98 శాతం డ్రాగన్ ఫ్రూట్ వియత్నాం తదితర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మన వాతావరణంలో కూడా 47 నుంచి 50 డిగ్రీల ఉష్ణోగ్రతలో దీనిని సాగు చేయవచ్చు. నాలుగు నెలలకు ఒకసారి వేప పిండి కలిపిన వర్మీకంపోస్ట్ 5 కిలోల వంతున మొక్కకు అందించాలి. పది రోజులకు ఒకసారి అరగంట పాటు డ్రిప్ ద్వారా నీరు అందిస్తే సరిపోతుంది. చీమలు మొక్కలపై కనిపిస్తే లీటర్ నీటికి 3 ఎంఎల్ వేపనూనె కలిపి మొక్కపై పిచికారి చేస్తుండగా. బ్యాక్టీరియా, ఫంగస్ వంటివి సోకినప్పుడు అగ్ని అస్త్రం వినియోస్తున్నారు. మొక్కలు ఎదుగుదలకు గోకృపామృతం, పంచగవ్యం, చీడల నివారణకు అగ్ని అస్త్రం వినియోగిస్తున్నారు. నాటు పశువుల సాయంతో తయారు చేసిన ఎరువులను పూర్తిగా ఎండబెట్టి వీటిలో జీవన ఎరువులను కలిపి వేయడం వలన వృథా తగ్గి పూర్తిగా మొక్కకు బలం చేకూరుతోంది.

తొక్కలతో లిప్‌స్టిక్

డ్రాగన్ ఫ్రూట్‌తో ఉప వస్తువులైన జామ్, చాక్లెట్, వైన్ వంటివి తయారు చేస్తుండగా వీటి తొక్కలతో ఫేషియల్స్, ఫుడ్ కలర్స్, లిప్‌స్టిక్స్ వంటివి కూడా తయారు చేస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు పుష్కలం

డ్రాగన్ ఫ్రూట్‌ను ఆహారంగా చేసుకోవడం ద్వారా బ్లడ్ షుగర్ అదుపులో ఉంటుంది. ఇమ్యూనిటీ పవర్‌ను పెంచడానికి, గుండెను పదిలంగా ఉంచడానికి, బరువు తగ్గడానికి, ఎక్కువ శాతం ఫైబర్ ఉండటం వలన జీర్ణశక్తికి, శరీరంలో పేరుకుపోయిన విష పదార్థాలు తొలగించడానికి, ప్రొస్టేట్ క్యాన్సర్ తగ్గించడానికి, మానసిక స్థితిని మెరుగుపరచడానికి, శరీర కాంతిని పెంచడానికి, దంతాలు, ఎముకలు పుష్టిగా ఉంచడానికి దోహదం చేస్తుంది. పుష్కలంగా విటమిన్ సి ఉండటంతో పాటు ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ బి, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, పాస్ఫరస్, నియాసిన్, రిబోఫ్లేవిన్ ఈ ఫ్రూట్ ద్వారా లభిస్తాయి. కాలుష్యంతో నిండిన ప్రస్తుత వాతావరణంలో సేంద్రియ సాగులో ఆరోగ్యం అందిస్తున్న ఈ ఫ్రూట్‌ను పలువురు ఆహారంలో చేరుస్తున్నారు.

ఉద్యానవన పంటగా ప్రోత్సహించాలి



ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్‌లలో డ్రాగన్‌ను పాక్షికంగా సాగు చేస్తున్నారు. డ్రాగన్ సాగును ప్రోత్సహించాలి. మార్కెటింగ్ వసతులు కల్పించాలి. నూతన పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం ద్వారా వ్యవసాయాధారిత పరిశ్రమలు పెరిగి రైతుకు లాభదాయకంగా ఉంటుంది. దీంతో కొత్త పరిశ్రమలు వస్తాయి. సేంద్రియ పద్ధతిలో సాగును పెంచాలి. డ్రాగన్ సాగుకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తాం. నర్సరీ ద్వారా మొక్కలు కూడా మేమే సరఫరా చేస్తాం. దీనికోసం 74169 99419 నంబరులో సంప్రదించవచ్చు.

–నెల్లిమర్ల సూర్యప్రకాష్, భీమిలి

5 ఎకరాల్లో 8,500 మొక్కలు



2022లో గుజరాత్ నుంచి ఒక్కో మొక్క రూ.65 వంతున కొనుగోలు చేసి 5 ఎకరాల్లో 8,500 మొక్కలు నాటారు. సిమెంట్ పోల్స్, మొక్కలు, డ్రిప్, ఫెన్సింగ్ తదితర ఖర్చుల కింద మొదట్లో ఈ అయిదు ఎకరాలకు రూ.33 లక్షలు ఖర్చు చేశారు. ఈ డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటిన 8వ నెల నుంచి ప్రారంభించి 25 ఏళ్ల పాటు దిగుబడి ఇస్తాయి. మొదటి ఏడాది ఒక్కో మొక్క నుంచి ఒక కిలో, రెండో ఏడాది 5 కిలోలు, మూడో ఏడాది 13 కిలోలు, 4వ ఏడాది 20 కిలోలు, 5వ ఏడాది నుంచి 27 కిలోల వంతున పంట కోతకు వస్తుంది. సాధారణంగా రసాయన ఎరువులతో పండిస్తే ఫ్రూట్ 700 గ్రాముల వరకు వచ్చి మూడు రోజులే నిల్వ ఉండగా.. సేంద్రియంగా సాగుచేయడం వల్ల 250 నుంచి 400 గ్రాముల వరకు వచ్చి 15 రోజుల పాటు నిల్వ ఉంటుంది. పొలం వద్ద ఈ ఫ్రూట్‌ను కిలో రూ.200 చొప్పున విక్రయిస్తుండగా.. టన్నుకు పైబడి ఆర్డర్లు వచ్చినప్పుడు కిలో రూ.130 నుంచి రూ.140 వరకు విక్రయిస్తున్నారు. వీటిని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఏటా ఐదు ఎకరాల పంట సాగుకు జీవన శిలీంద్రియ ఎరువులైన సూడోమోనాస్, ట్రైకోడెర్మా, వేపపిండి, పశువుల గెత్తం, సముద్రపు నాచు నుంచి తీసిన మైక్రో న్యూట్రియల్స్, గోకృపామృతం, పంచగవ్యం, అగ్నిఅస్త్రంతో పాటు లేబర్ చార్జీల కోసం రూ.8 లక్షలు ఖర్చు చేస్తుండగా మొదటి ఏడాది నుంచి లాభాలు ప్రారంభమయ్యాయి. పంట వేసి మూడో ఏడాది కాగా రూ.50 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు నెల్లిమర్ల సోదరులు తెలిపారు.

బైకు చోరీపై పోలీసులకు ఫిర్యాదు

ముంచంగిపుట్టు: మండలంలో గల జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు గ్రామంలో ఆదివారం రాత్రి పల్సర్ ఎన్ఎస్ 200సిసి బైకు చోరీకి గురి కావడంతో సోమవారం ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. బాధితుడు సీసా పూర్ణచందర్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.లబ్బూరు గ్రామంలో ఆదివారం రాత్రి ఇంటి వద్ద పార్కింగ్ చేసిన బైకు ఉదయం నుంచి కనిపించక పోవడంతో అంతా వెతికిన ఆచూకీ లభ్యం కాలేదన్నారు.దీంతో బైకు చోరీకి గురిందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరగిందన్నారు. సిల్వర్ కలర్ పల్సర్ ఎస్ఎస్ 200సిసి బైకు ఎపి39పిఎక్స్ 4193 నెంబర్ గల బైకు ఎక్కడ కనిపించి ఫోన్ నెంబర్ 8249061172 కు తెలియ జేయగలరని బాధితుడు పూర్ణచందర్ కోరారు.గత ఏడాది బైక్ దొంగతనాలు జరగడంతో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకొని దొంగతనాలను అడ్డుకట్ట వేశారు. బైక్ దొంగతనాలు గత రెండు నెలలుగా జరుగుతూ ఉండడం పట్ల ద్విచక్ర వాహనచోదకులు భయపడుతున్నారు.పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ద్విచక్రవాహన దారులు కోరుతున్నారు.

జంగిడివలసలో ప్రజావేదిక


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీ జంగిడివలస గ్రామంలో ఎంపీడీవో ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తమది రెండు ఇంజిన్ల ప్రభుత్వమని అరకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొర చెప్పారు. మాజీ ఎంపీపీ ధన్నేరావు, ఎంపీటీసీ వి.రాజేశ్వరి పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు


అనుమానితులను ప్రశ్నిస్తున్న సీఐ వెంకటరావు

జి.మాడుగుల: మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వార్షికోత్సవాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పాడేరు–చింతపల్లి రోడ్డులో మండలంలోని ఉరుము జంక్షన్ వద్ద సీఐ సీహెచ్.వెంకటరావు, ఎస్ఐ కుమార్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. మూడు రోడ్లలో రాకపోకలు సాగించే వాహనాలను రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని వారు కోరారు.

మావోయిస్టులతో ఒరిగిందేమీ లేదు

- అంతా జనజీవన స్రవంతిలో కలవాలి
- అన్నవరంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

చింతపల్లి: మావోయిస్టుల వల్ల గిరిజనులకు ఒరిగింది ఏమీ లేదని సీఐ రమేష్, ఎస్ఐ రాజారావు అన్నారు. గిరిజనులతో కలిసి సోమవారం అన్నవరం వారపుసంతలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి మావోయిస్టులు చాలా కాలం పాటు ఆటంకం కలిగించారని చెప్పారు.వారి వల్ల అనేక గ్రామాలు రహదారి సౌకర్యానికి నోచుకోలేదని తెలిపారు. మావోయిస్టులకు ఎవరూ సహకరించవద్దని, తెలిసో తెలియకో మావోయిస్టులలో చేరిన వారంతా జనజీవన స్రవంతిలో కలిసి మంచి జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని చెప్పారు.గంజాయి తరలింపు, సాగును విడిపెట్టాలని, ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని సీఐ, ఎస్ఐ తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- విద్యార్థుల పరిస్థితి విషమిస్తే ఐటీడీఏ పీవోలకు సమాచారం
- జేసీ నేతృత్వంలో వైద్యపరీక్షల కమిటీ ఏర్పాటు
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు

సాక్షి, పాడేరు: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన గిరిజన విద్యార్థుల మరణాలపై ఆరా తీయడంతో పాటు వైద్యశిబిరాలు నిర్వహణ, సికిల్‌సెల్ ఎనిమియా పరీక్షలపై ఐటీడీఏల పీవోలు,వైద్య ఆరోగ్యశాఖ,గిరిజన సంక్షేమశాఖ, గురుకులం విభాగం అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు అనారోగ్య సమస్యలతో బాధపడితే వారిని సకాలంలో ఆస్పత్రులకు తరలించి వైద్య సేవలు కల్పించాలన్నారు.విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉంటే ఆయా పరిధిలోని ఐటీడీఏ పీవోలకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థుల అనారోగ్యంపై తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆస్పత్రిలో చేరిన విద్యార్థులను వైద్యులు సక్రమంగా పర్యవేక్షించకుండా డిశ్చార్జ్ చేస్తే ఆ తరువాత విద్యార్థులకు ఏం జరిగినా సంబంధత వైద్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు కోలుకున్నాక ఆశ్రమ పాఠశాలలకు పంపాలని,ఇళ్లకు మాత్రం పంపవద్దని ఆయన ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో వైద్యపరీక్షల కమిటీ ఏర్పాటు చేస్తున్నామని,అన్ని ఆశ్రమ పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలతో సిక్ రూమ్‌లు కూడా అందుబాటులోకి తెస్తామని చెప్పారు.సిక్ రూమ్‌ల నిర్వహణపై హెచ్‌ఎం,వార్డెన్‌లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. వైద్యపరీక్షల నిర్వహణపై ప్రణాళికలు రూపొందించాలని,మూడు ఐటీడీఏల పరిధిలో ఒకే విధమైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జేసీ అభిషేక్‌గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్,రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం(వర్చువల్‌గా),డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు,డీఐవో డాక్టర్ సాధన, డీడీ కొండలరావు,అన్ని మండలాల ఏటీడబ్ల్యూవోలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వరదనీటితో ఇక్కట్లు


గ్రామంలో చిత్తడిగా మారిన ఓ వీధి


శ్రమదానంతో రహదారి నిర్మిస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని యూ చీడిపాలెంలో ఇళ్లన్ని అధ్వానంగా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గదులన్నీ వరదనీరు చేరడంతో కనీసం పడుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందంటున్నారు. గోడలు బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి కూడా పాడైందన్నారు. శ్రమదానంతో కొంతవరకు పనులు చేసుకుంటున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ


రేవంత్ (ఫైల్)

కాకినాడ క్రైం: ఆ యువకుడి అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ లభించింది. పశ్చిమ గోదావరి జిల్లా తోకలపూడి గ్రామానికి చెందిన పోలిశెట్టి రేవంత్ శ్రీ మురహరి (19) స్వగ్రామం నుంచి విశాఖపట్నానికి పరీక్ష రాసేందుకు ఈ నెల 21వ తేదీన బయలుదేరాడు. మార్గం మధ్యలో ఎర్రవరం హైవేపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించగా తగిన వైద్య సేవలు అందించినా తలకు తీవ్ర గాయం కావడంతో ఫలితం లేకపోయింది. బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో వైద్యులు డాక్టర్ ఎంవీ కిరణ్‌కుమార్, డాక్టర్ శివరామగాంధీ కుమారుడి పరిస్థితిని తండ్రి సుబ్రహ్మణ్యంకి వివరించి అవయవ దాన ప్రాధాన్యాన్ని వివరించారు. దీంతో సుబ్రహ్మణ్యం జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో తన కుమారుడి అవయవదానానికి రిజిస్టర్ చేశారు. దీంతో రేవంత్ కిడ్నీని కాకినాడ అపోలో ఆసుపత్రికి, మరో కిడ్నీని విశాఖపట్నం కేర్ ఆసుపత్రికి, కాలేయాన్ని షీలానగర్ అపోలో ఆసుపత్రికి తరలించి ముగ్గురి ప్రాణాలు కాపాడారు. ఇందుకు కాకినాడ అపోలోలో ఆర్గాన్ హార్వెస్టింగ్ నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ సాయంతో సోమవారం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి అవయవాలను సురక్షితంగా సకాలంలో తరలించారు.

సమస్యలపై పీవోకు వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు కోసం గ్రామం దాటి రావాలంటే రోడ్డు సదుపాయం లేదని తమ గ్రామానికి రోడ్డున నిర్మించాలని దేవీపట్నం మండలం తున్నూరు గిరిజన యువత రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలనకు వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామంలో పలు సమస్యలపై ఎంపీటీసీ సభ్యుడు వంశీ కుంజం, సర్పంచ్ విజయ భాస్కర్ రెడ్డిలతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో గర్భిణులను ఆస్పత్రికి తీసుకువెళ్లాలన్న, అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదన్నారు. గ్రామంలోని రోడ్డు పరిస్థితికి సంబంధించి ఫోటోలను పీవోకు అందజేశారు. గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మించాలని కోరారు.గిరిజనుల సమస్యలపై పీవో సానుకూలంగా స్పందించారు. గిరిజనుల నుంచి సుమారు 90 ఆర్జీలు స్వీకరించారు. చింతలపూడి పంచాయతీలో కన్నెరు వాగుపై వంతెన పనులు పూర్తి చేయాలని, కొత్తూరు రోడ్డు పనులు పూర్తి చేయాలని సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ, పల్లాల మంగిరెడ్డి కత్తుల సుగ్గిరెడ్డి అర్జీ అందజేశారు. రంపచోడవరం మండలం దబ్బవలస గ్రామంలో మూడు కుటుంబాలకు చెందిన గిరిజనులు 20 ఎకరాల భూమికి పట్టా మంజూరు చేయాలని కోరారు. కానివాడ పరిధిలో 3500 మొక్కలు రబ్బరు పాలు సేకరణ, ప్రాసెసింగ్ కోసం పరికరాలు ఇవ్వాలని గిరిజనులు కోరారు. బొడ్డగుంట వరకు రోడ్డు నిర్మించాలని గిరిజనులు కోరారు. ఏపీడీ డీఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి పారా స్విమ్మింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ పోటీలు ఈనెల 29 నుంచి రైల్వే అక్వా స్విమ్మింగ్ పూల్‌లో జరగనున్నాయి. ఈ సందర్భంగా పోటీల పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ విడుదల చేశారు. కలెక్టర్ చాంబర్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పలు జిల్లాలకు చెందిన పారా స్విమ్మర్లు ఈ పోటీల్లో పాల్గొనున్నారన్నారు. క్రీడాప్రాధికార సంస్థ పర్యవేక్షణలో పారా స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో పోటీలు జరగనున్నాయి.

ఉపాధి కల్పనలో పారిశ్రామికవేత్తల పాత్ర కీలకం

తగరపువలస: ఉపాధి కల్పన పెంపొందించడంలో పారిశ్రామికవేత్తల పాత్ర కీలకమని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ సౌరభ్ బాజ్‌పాయ్ అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ, ఎస్ఐడీబీఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న పీజీ సర్టిఫికెట్ ఇన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ 18 నెలల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భారత వ్యవస్థాపక సంస్కృతిని ఉపయోగించుకోవడానికి గాను విభిన్న నేపథ్యాల నుంచి 30 మంది వర్ధమాన పారిశ్రామికవేత్తలను ఎంపిక చేసినట్టు తెలిపారు. 10 నెలల అకడమిక్ శిక్షణ 8 నెలల వెంచర్ క్రియేషన్ కోసం మెంటర్‌షిప్ ఉంటుందన్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ ప్రొఫెసర్ సుశీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ సమగ్ర కార్యక్రమం లక్ష్యం స్కిల్ టు ఎంటర్‌ప్రైజెస్ మోడల్ ద్వారా ఆవిష్కరణ, ఆర్థికవృద్ధి వైపు నడిపిస్తామన్నారు. రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ అమిత్‌శంకర్ , ప్రోగ్రాం కో డైరెక్టర్ ప్రొఫెసర్ జోస్యుల శ్రీనివాస్, డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.